JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 27-06-2026
Medchal - Malkajgiri । Saturday 27-06-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 26
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 26 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com





## రాముడి పేరుతో మోసం

### సహించేది లేదు: యోగి హెచ్చరిక

- రామమందిర విరాళాల దుర్వినియోగం పై స్పందించిన యోగి ఆదిత్యనాథ్
- ఈ కేసులో జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని స్పష్టీకరణ.. సిట్ నివేదిక అందిన వెంటనే చర్యలు చేపట్టామని వెల్లడి
- ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్ట్

జయభేరి, అయోధ్య :

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. ''అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం'' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. ''ఒకప్పుడు శ్రీరాముడు లేదని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర ...మిగతాది 2 లో

## అమరావతిలో బసవతారకం

- తొలి దశలో 500 పడకలతో 2028 నాటికి వైద్య సేవలు ప్రారంభించాలని ట్రస్ట్ లక్ష్యం




జయభేరి, అమరావతి :

అమరావతిలో రూ.750 కోట్లతో నిర్మిస్తున్న బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తొలి దశలో 500 పడకలతో 2028 నాటికి వైద్య సేవలు ప్రారంభించాలని ట్రస్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన తర్వాత వెయ్యి పడకలతో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కేంద్రంగా ఈ ఆస్పత్రి సేవలు అందించనుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ పనులు ఊపందుకున్నాయి. తొలి దశ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసి, 2028 నాటికి వైద్య సేవలు ప్రారంభించాలనే లక్ష్యంతో ట్రస్ట్ ముందుకు సాగుతోంది. ఒకప్పుడు 2019లో శంకుస్థాపన జరిగినా వివిధ కారణాలతో నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు.. ఇప్పుడు మళ్లీ వేగం అందుకుంది.




# డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మూలనకు కృషి






డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, డ్రగ్స్ నియంత్రణలో పనిచేస్తున్న పోలీసు శాఖ, ఈగల్ ఫోర్స్ సిబ్బందికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందన్నారు.



- డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

జయభేరి, హైదరాబాద్ :

శుక్రవారం గచ్చిబౌలిలోని శిల్పకళా వేదికలో ఈగల్ (EAGLE) ఫోర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "సే నో టు డ్రగ్స్" అవగాహన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వందేమాతరం మరియు రాష్ట్ర గీతాలను ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణలో మాదకద్రవ్యాలకు ఏమాత్రం స్థానం లేకుండా ...మిగతాది 2 లో

## లంచం కేసులో చిక్కిన తహసీల్దార్

- రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- లంచం కేసులో పట్టుబడ్డ షామీర్‌పేట తహసీల్దార్ సుచరితపై మరో కేసు
- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు తేలడంతో కేసు నమోదు చేసిన ఏసీబీ
- సోదాల్లో రూ. 5.05 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించిన అధికారులు
- నెల క్రితం రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సుచరిత



జయభేరి, షామీర్‌పేట :

లంచం కేసులో అరెస్టయి సస్పెన్షన్‌కు గురైన షామీర్‌పేట మాజీ తహసీల్దార్ టి. సుచరిత మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన నెల రోజులకే ఈ కొత్త కేసు నమోదు కావడం గమనార్హం. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలంలో తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, ...మిగతాది 2 లో




## ఐఏఎస్ బదిలీలు

జయభేరి, హైదరాబాద్, జూన్ 26 :

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు.. బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించింది. అదే సమయంలో సీఎంఓ నుంచి అజిత్ రెడ్డిని తొలగించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐఏఎస్ శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. అదే సమయంలో శైలజా రామయ్యర్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది. మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను ...మిగతాది 2 లో




## ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు

- ప్రభుత్వానికి విజయశాంతి కీలక ప్రతిపాదన
- ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ కాలేజీలు కనీస ప్రమాణాలు పాటించాలన్న విజయశాంతి
- చాలా కాలేజీల్లో వసతులు లేవన్న విజిలెన్స్ నివేదికను గుర్తుచేసిన ఎమ్మెల్సీ
- ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలోని ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లతో పాటు, కనీస విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ...మిగతాది 2 లో

## తెలంగాణ ప్రభుత్వ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

- ఈ నెల 30తో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం పూర్తి
- 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు
- ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు
- జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరణ



జయభేరి, హైదరాబాద్ :

1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఇటీవలే కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ ఆయన్ను పేరెంట్ కేడర్‌కు బదిలీ చేసింది. మూడు రోజుల క్రితం ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కే. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సంజయ్ జాజును రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## డ్రగ్స్ నిర్మూలనకు కృషి

చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఈగల్ (EAGLE) ఫోర్స్ మరియు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (TSNAB) డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కోసం కఠిన చర్యలతో పాటు విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, డ్రగ్స్ నియంత్రణలో పనిచేస్తున్న పోలీసు శాఖ, ఈగల్ ఫోర్స్ సిబ్బందికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందన్నారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని, "Say No to Drugs" సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనలో చట్టాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక నాయకులు, సినీ ప్రముఖులు యువతను చైతన్యపరిచే కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పు కలిగించే డ్రగ్స్ మాఫియాపై ఎంతటి కఠిన చర్యలైనా తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం ఒక్కటే కాకుండా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక వాలంటీర్లుగా మారాలని, ఎక్కడైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు కలిసి యువతలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. చెడు మార్గం ఆకర్షణీయంగా కనిపించినా దాని ఫలితం వినాశనమేనని, మంచి మార్గంలో నడవడం ద్వారా మాత్రమే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో యువత సైనికుల్లా ముందుండి సమాజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ తో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల సేవలను అభినందిస్తూ, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సినీ నటుడు రామ్ పోతినేని, సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని, చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని కోరారు. “నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ఉప ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీ సి.వి. ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, విద్యార్థులు మరియు పలువురు పాల్గొన్నారు.

## ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు

ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను విజయశాంతి స్వాగతించారు. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఫీజులు వసూలు చేసే హక్కు ప్రైవేట్ యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ కమిషన్ సమర్పించిన నివేదిక సైతం పలు ప్రైవేట్ కళాశాలల్లో సరైన వసతులు లేవని స్పష్టం చేసిన విషయాన్ని విజయశాంతి గుర్తుచేశారు. ఈ అంశాన్ని తాను ఇదివరకే శాసనమండలిలో సైతం ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రజాధనంతో చెల్లించే రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఐఏఎస్ బదిలీలు

ఎం.రఘునందన్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేసింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నకు పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో కీలకమైన మార్పులకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టారు. పాలనా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించడంలో భాగంగా సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. గత కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని తీసేసి.. శ్రీధర్‌కు చోటు కల్పించారు. శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలంగాణ సచివాలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.

## రాముడి పేరుతో మోసం

నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం” అని వ్యాఖ్యానించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నగదు నిర్వహణ, ఉద్యోగుల నియామకాలు, సీసీటీవీ పర్యవేక్షణ, బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## మొహరం సందర్భంగా షర్బత్ పంపిణీ

✍ జయభేరి, కమాన్ పూర్ :

మొహరం పండుగ సందర్భంగా షర్బత్ (తీపి పానకం) శుక్రవారం పంపిణీ చేశారు. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో గల మహమ్మదీయ మస్జిద్లో మోబిన్ మరియు కలీం ఆధ్వర్యంలో షర్బత్ను పంపిణీ చేశారు. శుక్రవారం నమాజ్ చేసిన అనంతరం ఫాతిహా ఇచ్చి ఆయా షర్బతును మస్జిద్ లోని నమాజ్ కు వచ్చిన యువకులకు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొహరం నెల విశిష్టత గురించి మత గురువు మోబిన్ వివరించారు. ఈనెల హసేన్ హుస్సేన్ వార్ల జ్ఞాపకార్థం సంతాపదినాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇజాజ్ ఖా న్ సయ్యద్ ఇమామ్, హఫీజ్, అక్తర్, అజ్జు, షేక్ అలీ, బషీర్, తపస్సు నమాజ్, జబ్బార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే...2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాళ్టి స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహలేనని కొట్టిపారేస్తోంది. దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది.

మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది.

ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది.

ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిష్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు.

తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 23 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది. బూత్ లెవెల్ అధికారులు ప్రత్యక్షంగా 34 సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు తనిఖీ చేయాలి. విదేశీయులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రక్రియ సరికాదనే సూచనలు వస్తున్నాయి. ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం సర్ అవసరమే అనే వాదనతో అన్ని పార్టీలూ ఏకీభవిస్తున్నాయి. కానీ సర్ ప్రక్రియకు ఎంచుకుంటున్న సమయం, సందర్భంపై మాత్రం భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఇక్కడ అవకతవకలు ఉన్నాయా.. లేదా అనేది పక్కనపెడితే.. అసలు అనుమానాలు కలిగేలా ఎందుకు వ్యవహరించాలనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా జవాబు వెతకాల్సిందే. అటు పార్టీలు, ఇటు ఓటర్లు అందరిలోనూ నమ్మకం కలిగించే విధంగా ఈసీ విధానాలకు పదును పెట్టాలనే సలహాలు వస్తున్నాయి. అనవసర ఆందోళనలు, వివాదాలకు తావివ్వకుండా.. ఎవ్వరూ వేలెత్తిచూపటానికి వీల్లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో సర్ జరగాలనే భావన వ్యక్తమవుతోంది. అయితే మన దగ్గర బీహార్, బెంగాల్ మాదిరి రగడకు ఆస్కారం లేదని, ఇక్కడ చాలావరకు ఓటర్లకు సరైన పత్రాలుంటాయనే అభిప్రాయాలు కూడా లేకపోలేదు.




- ఏపీ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తెలంగాణ బిడ్డలు
- నారా లోకేష్ ట్వీట్ వైరల్! టాలెంట్‌కు బోర్డర్లు లేవంటూ ప్రశంసలు

✍ జయభేరి, విజయవాడ, జూన్ 26 :

రాష్ట్రాలు వేరైనా, రాజకీయాలు ఎల్లలు గీసినా.. నిజమైన ప్రతిభకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకావనే సరికొత్త చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత కొన్ని వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ సెంటిమెంట్, నిజమైన తెలంగాణ బిడ్డ ఎవరు? అనే రాజకీయ లెక్చర్లు, వాదోపవాదాలు జరుగుతున్న తరుణంలో.. దీనికి పూర్తిగా భిన్నమైన, ఆరోగ్యకరమైన ఒక ని ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టును ముందుండి నడిపిస్తున్న కీలక వ్యక్తుల నేపథ్యమే ఇందుకు ప్రధాన కారణం. ఈ సరికొత్త చర్చకు ఒక సీనియర్ జర్నలిస్ట్ పెట్టిన ట్వీట్ వేదికైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారిణి ధాత్రి రెడ్డి పక్కా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆమెతో పాటు ఈ ప్రాజెక్టులో కీలక భూమిక పోషిస్తున్న దీప్తి, ఒకప్పుడు అమెరికాలో ఉంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. కోసం తీవ్రంగా శ్రమించిన యాక్టివిస్ట్. ఒకప్పుడు మనం.. ఆంధ్రానా అని అదోలా నవ్వుకున్న ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు, నేడు నవ్యాంధ్ర ప్రగతి చక్రంలో అత్యంత కీలకమైన ఆవిష్కరణల విభాగాన్ని నడిపిస్తున్నారు. రాజకీయం గీసిన అదృశ్య బోర్డర్లను దాటి ప్రతిభ తన దారిని తాను ఎలా వెతుక్కుంటుందో చెప్పడానికి ఇది నిదర్శనంగా నిలిచింది. సదరు జర్నలిస్ట్ తన ట్వీట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని వారాలుగా తెలంగాణ సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్న ఉపన్యాసాల మధ్య, ఏపీ ప్రభుత్వ ప్రాజెక్టులో ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు లీడ్ రోల్ పోషిస్తున్నారనే వార్త నాలో ఆనందం నింపింది. ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్ర అవసరాలకు ఎలాంటి టాలెంట్ కావాలో చూసింది తప్ప, ఆ టాలెంట్ ఏ ప్రాంతం నుండి వచ్చిందో చూడలేదు. మీ మాతృభూమిపై మీకు గర్వం ఉండొచ్చు, కానీ ఏ రాజకీయ నేత కూడా మీ ప్రతిభను రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆపలేరని గుర్తుంచుకోండి" అని సదరు జర్నలిస్ట్ రాసుకొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం సెంటిమెంట్‌ను వాడుకునే నేతల అసలు రంగును గుర్తించాలని పిలుపునిచ్చారు ఈ వైరల్ ట్వీట్‌పై ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ , మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ అద్భుతమైన రిప్లై ఇచ్చారు. "దీనితో నేను వంద శాతం ఏకీభవిస్తున్నాను. మేము నిర్మిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ సరిగ్గా ఇలాగే ఉంటుంది. భౌగోళిక సరిహద్దుల కంటే ప్రతిభకు మాత్రమే విలువనిచ్చే రాష్ట్రాన్ని మేము తయారుచేస్తున్నాం. మా వద్దకు వచ్చే వారిని మీరు ఎక్కడి నుండి వచ్చారు అని మేము అడగం.. మీరు ఈ రాష్ట్రం కోసం ఏం నిర్మించగలరు? అని మాత్రమే అడుగుతాం. మీ మూలాలను గౌరవించండి, కానీ రాష్ట్ర బోర్డర్లు మీ అవకాశాలను పరిమితం చేయనివ్వకండి. ఆంధ్రప్రదేశ్ అనేది ఎవరు ఎక్కడి నుండి వచ్చారనే దానిపై కాకుండా, అందరం కలిసి ఏం నిర్మిస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది" అని లోకేష్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, నేటికీ కొందరు నాయకులు ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న తరుణంలో.. ఈ ఉదంతం బ్యూరోక్రటిక్, ఐటీ వర్గాల్లో సరికొత్త ఆలోచనకు తెరలేపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంతీయ బేధాలు చూడకుండా తెలంగాణకు చెందిన సమర్థులైన అధికారులకు, లీడర్లకు అగ్రతాంబూలం ఇవ్వడం శుభ పరిణామం అని నెటిజన్లు కొనియాడుతున్నారు. అభివృద్ధి, ఆవిష్కరణల విషయంలో సంకుచిత రాజకీయ ఆలోచనలను పక్కనబెట్టి, టాలెంట్‌ను మాత్రమే కొలమానంగా తీసుకుంటేనే ఉమ్మడి తెలుగు జాతి ప్రపంచ పటంలో మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటుందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

## అమరావతిలో బసవతారకం

హైదరాబాద్‌లో మూడు దశాబ్దాలుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న బసవతారకం సంస్థ.. ఇప్పుడు అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అత్యాధునిక చికిత్స అందించేందుకు సిద్ధమవుతోంది. క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లాల్సిన పరిస్థితి.. భవిష్యత్తులో చాలా వరకు తగ్గే అవకాశం కనిపిస్తోంది. అమరావతి తుళ్లూరు సమీపంలో 21 ఎకరాల్లో బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణం జరుగుతోంది. తొలి దశకు రూ.750 కోట్ల వ్యయంతో 500 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. ఇందులో అత్యాధునిక అంకాలజీ, రేడియేషన్, సర్జికల్, మెడికల్ క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ దశ పూర్తయిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని ట్రస్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు కొత్తది కాదు. 2019లో అప్పటి ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన జరిగినప్పటికీ.. తర్వాత అమరావతి అభివృద్ధి నిలిచిపోవడంతో ఆసుపత్రి నిర్మాణం కూడా ముందుకు సాగలేదు. ప్రభుత్వం మారిన తర్వాత ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి వచ్చింది. అదనంగా భూమి కేటాయించడంతో మొత్తం 21 ఎకరాల్లో నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఇటీవల పనులకు శ్రీకారం చుట్టిన ట్రస్ట్.. తొలి దశ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రకటించింది. బసవతారకం ఆసుపత్రి అంటే కేవలం మరో క్యాన్సర్ హాస్పిటల్ కాదు. ఎన్టీఆర్ తన సతీమణి బసవతారకం స్మారకార్థం స్థాపించిన ఈ సంస్థ.. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను తక్కువ ఖర్చుతో అందిస్తూ దేశంలోనే ప్రముఖ క్యాన్సర్ కేంద్రంగా ఎదిగింది. ప్రస్తుతం 500కు పైగా పడకలు, ఆధునిక చికిత్సా సదుపాయాలతో వేలాది మంది రోగులకు సేవలందిస్తోంది. అదే సేవా తత్వాన్ని అమరావతికి విస్తరించడమే ఈ కొత్త క్యాంపస్ లక్ష్యం. తొలి దశలో 500 పడకలతో సేవలు ప్రారంభించి.. రెండో దశలో మరో 500 పడకలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుతుంది. పరిశోధన విభాగాలు, ప్రత్యేక సర్జరీ విభాగాలు, ఆధునిక నిర్ధారణ కేంద్రాలు, రీజినల్ రిఫరల్ సెంటర్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక ఉంది. బాలకృష్ణ ప్రకటించిన ప్రకారం.. 2028 నాటికి తొలి దశ పూర్తిచేసి రోగులకు వైద్య సేవలు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. అమరావతి మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు కూడా ఈ ఆసుపత్రి కీలక వైద్య కేంద్రంగా మారనుంది. హైదరాబాద్‌లో విశ్వసనీయ క్యాన్సర్ చికిత్సకు చిరునామాగా నిలిచిన బసవతారకం ఆస్పత్రి.. ఇప్పుడు అమరావతిలోనూ అదే స్థాయి వైద్య సేవలను అందించేందుకు అడుగులు వేస్తోంది. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తైతే.. 2028 నుంచి క్యాన్సర్ రోగులకు రాజధానిలోనే అత్యాధునిక చికిత్స అందుబాటులోకి రానుంది.

## లంచం కేసులో చిక్కిన తహసీల్దార్

జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన సుచరిత, ఆమె డ్రైవర్ వి. నగేష్‌ను మే 26, 2026న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా (NOC) మార్పిడి కోసం ఒక వ్యక్తి నుంచి ఎకరాకు లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా రూ. 2 లక్షలు ముడుపులు తీసుకుంటుండగా అధికారులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జూన్ 25న సుచరితపై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆమె నివాసంతో పాటు ఇతర మూడు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 12 లక్షల నగదు, రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ. 38 లక్షలు, ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లు, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ప్లాట్లు, సిద్దిపేట జిల్లా దమ్మరకుంట గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు 5.05 కోట్లు రూపాయలుగా ఉంటుంది. లంచం కేసు తర్వాత సస్పెన్షన్‌కు గురైన సుచరితపై తాజాగా నమోదైన అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

- సమాజానికి మేలు చేయండి
- ఆరోగ్యకరమైన ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకుందాం
- ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో డీసీపీ శిరీష

**జయభేరి, షాద్ నగర్, జూన్ 26 :**







ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం)లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి డీసీపీ శిరీష,ఏసీపీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ....విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో గౌరవం, గుర్తింపు, మంచి స్థానం పొందడానికి విద్య ఒక్కటే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. వి

ద్యార్థులు చిన్న వయస్సులోనే మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని, క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా, యువత జీవితాలను నాశనం చేస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల వినియోగం ఒకటని, మత్తు పదార్థాల ప్రభావానికి లోనైతే ఆరోగ్యం, విద్య, కుటుంబ సంబంధాలు మరియు భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. స్నేహితుల ఒత్తిడి, తప్పుడు ఆకర్షణలు లేదా ఆసక్తి పేరుతో మాదక ద్రవ్యాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...విద్యార్థులు తమ చుట్టూ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి (జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ) ప్రీతి (రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్), పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

---



## నిర్మల్ జైలు నుండి చర్లపల్లి జైలుకు

- గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

**జయభేరి, హైదరాబాద్ :**

అత్యాచారం కేసులో న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించడంతో.. కొన్నేళ్లుగా నిర్మల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ సోన్న అడెల్లు అనారోగ్యం పాలయ్యాడు. దీంతో అతన్ని చర్లపల్లి జైలుకు తరలించి అవసరాన్ని బట్టి గాంధీ హాస్పిటల్ లోచికిత్స అందిస్తున్నారు. చాతీ, ఒళ్లు నొప్పులతో అనారోగ్యానికి గురైన అతడికి పలుమార్లు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈనెల 24న గుండెపోటు రావడంతో హాస్పిటల్ లో చేర్పించారు. ఈ క్రమంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో డయాలసిస్ కూడా చేశారు. చికిత్స పొందుతూ గురువారం ఖైదీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కార్డియోజెనిక్ షాక్ తో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుటుంబసభ్యులకు జైలు అధికారులు సమాచారం అందించారు.

---

## స్థల దాతలను సన్మానించిన గ్రామస్తులు



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 26 :**

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో మహిళా సంఘ భవనానికి 100 గజాల భూమిని బొత్త వెంకటేశం జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు బొత్త లక్ష్మి కిష్టయ్య దంపతులు స్థలాన్ని బహూకరించడం పట్ల గ్రామస్తులు శుక్రవారం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొత్త రాములు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ లు మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘం భవనానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలరాజు, సీనియర్ నాయకులు కిష్టయ్య, తిరుపతి, శ్రీశైలం, జక్కుల శ్రీశైలం, నక్కల వెంకటేష్, దయానంద్, శ్రీను, కుంభం, బినారం కనకయ్య, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

## విద్యార్థుల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తాం

- నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షల నిర్వహణే లక్ష్యం :ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**




భారత దేశంలోని విద్యార్థులు,యువత సమస్య లను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించడమే ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమ ఉద్దేశమని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజస్థాన్ కోటాలో విద్యార్థులు, యువత సమస్యలను తెలుసుకుంటున్న రాహుల్ గాంధీ కార్యక్రమాన్ని ఎస్ఈడీ స్క్రీన్ వీక్షించారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, యువత ఆశయాలకు అండగా నిలవడమే తమ బాధ్యత అని అన్నారు. ప్రతి విద్యార్థి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కు కలిగి ఉండాలని, వారి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి చేరేలా ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విద్యార్థులు యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకురావడమే ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ చేసి ఎంతోమంది విద్యార్థుల జీవితాలను మోదీ నాశనం చేశారని,వారందరికీ కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య,పారదర్శకమైన పరీక్షల వ్యవస్థ,ఉద్యోగాల భర్తీ,యువతకు సమాన అవకాశాలు కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. ఆఖరికి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను కూడా చోరీ చేసిన దొంగ మోదీ అని మండిపడ్డారు. నరేంద్ర మోదీకి 2029 సంవత్సరంలో ప్రజలు బుద్ధి చెబుతారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. 2029లో కేంద్రంలో రాహుల్ ప్రధాని అవుతాడని, తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఓటు, సీటు, నోటు చోరీ కేంద్ర విధానమని, వాళ్లకు విద్యార్థులు, యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ, సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ భవ్యశ్రీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఫైజర్, ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రణధీర్, మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ఈయుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## గంజాయి నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

- షాద్‌నగర్ పోలీసులు, ఎస్ఓటి వారి ఆధ్వర్యంలో 650 గ్రాముల గంజాయి స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్

**జయభేరి, షాద్ నగర్, జూన్ 26 :**





షాద్‌నగర్ పట్టణంలోని నేషనల్ మార్ట్ సమీపంలో గంజాయి వినియోగం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంపై షాద్‌నగర్ పోలీసులు వెంటనే స్పందించి దాడి నిర్వహించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. పోలీసులు చూడగానే వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద తనిఖీ నిర్వహించగా సుమారు 650 గ్రాముల గంజాయి లభ్యమైంది.

**పట్టుబడిన నిందితులు:..**

గంగా మాడి (21), ప్రైవేట్ ఉద్యోగి.రమేష్ కుమార్ (18), సెక్యూరిటీ గార్డ్.విచారణలో మొదటి నిందితుడు శ్రీకాకుళం ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి షాద్‌నగర్‌కు తీసుకొచ్చినట్లు, ఇద్దరూ కలిసి గంజాయి సేవించినట్లు ఒప్పుకున్నారు.

**నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్నవి...**

650 గ్రాముల గంజాయి, రెండు రెడ్‌మీ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం, 1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. షాద్‌నగర్ పోలీసులు మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగిస్తారని, ప్రజలు ఇలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని పోలీసు అధికారులు తెలిపారు.

---

## సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 26 :**




భువనగిరి పట్టణ కేంద్రంలో జూలై 5వ తేదీన జరిగే సమరభేరి బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు గోనె కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో బహిరంగ సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరిలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భావన వెంకటేష్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్ గౌడ్, బెంగల్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ నరేందర్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాంగల కిష్టయ్య, దత్తాయిపల్లి శాఖ నాయకులు కొండం వెంకటేష్, పైసా మల్లికార్జున్, కొత్తింటి సురేష్ పాల్గొన్నారు.

---



## రామాజీపేట పాల సంఘం చైర్మన్ గా శిరీష శంకర్ రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 26 :**

యాదగిరిగుట్ట మండలం రామాజీపేట పాల సంఘం చైర్మన్ గా కల్లూరి శిరీష శంకర్ రెడ్డి ఎన్నికైనట్లు అధికారి గుజ్జ బలరాం తెలిపారు.శుక్రవారం జరిగిన ఎన్నికలో చైర్మన్ తో పాటు నూతన నూతన డైరెక్టర్ మొగిలిపాక ఇస్తారి, పోతరాజు నర్సింహులు, డైరెక్టర్లుగా జాగ్గిళ్లపురం దశరథ, కుండె కమలమ్మ, కొండపురం స్వప్న ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ లు తిరుమల రమేష్, నమిలే ఉపేంద్ర వెంకట్రాజు, ఉపసర్పంచ్ యాట పరుషురాం, వార్డు సభ్యులు ఆరె బాలమణి, మొగిలిపాక భానుప్రకాష్, పెరుమండ్ల అరుణ ముత్యాలు, మొగిలిపాక పృథ్వీ రాజ్, నాయకులు కల్లూరి రఘుపతి రెడ్డి, కొండపురం ఆంజనేయులు, మొగిలిపాక భాస్కర్, కలెపల్లి బాలరాజు, మహేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

---

## షాద్ నగర్ లో ఘనంగా మొహరం పండుగ వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్
- పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు.. హిందూ-ముస్లిం ఐక్యతకు మొహర్రం ప్రతీక అన్న నాయకులు



**జయభేరి, షాద్ నగర్, జూన్ 26 :**

మొహర్రం సందర్భంగా శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూక్‌నగర్ పట్టణం ముదిరాజ్ కాలనీలో నిర్వహించిన పీర్ల వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ పాల్గొన్నారు. వారు పీర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణలో అనేక సంవత్సరాలుగా హిందూ-ముస్లింలు సోదరభావంతో కలిసి మొహర్రం (పీర్ల) పండుగను జరుపుకోవడం రాష్ట్ర సాంస్కృతిక సామరస్యానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి వేడుకలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి), ముబారక్ అలీ ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం, మహమూద్, అశోక్, బీరప్ప, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 26 :**

యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువకుతో కలిసి 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏ పని చేయడానికైనా కాన్ఫిడెన్స్ పెరుగుతుందని,ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా,ఫిట్ గా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత తెలంగాణ మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

---

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన త్యాగం చిరస్మరణీయం



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 26 :**

శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన త్యాగం చిరస్మరణీయమని బిజెపి రాష్ట్ర నాయకుడు సుర్వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయత, కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండకూడదనే సిద్ధాంతంతో ఆయన చివరి వరకు పోరాడారని అన్నారు. దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి పాటుపడాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, సీనియర్ నాయకులు యాట పెంటయ్య, పాముల రామచంద్రం, గోర్ల రామచంద్రం, గుండెబోయిన మల్లేశం, వార్డు సభ్యులు బత్తుల అనిల్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.. తహసిల్దార్ రవికుమార్

జయభేరి, తుర్కపల్లి, జూన్ 26 :

మండలంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసిల్దార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం గంధమల్ల, కొండాపురం గ్రామంలో బిఎల్వోలు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమానికి బిఎల్ఓలకు ప్రజలు సహకరించాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బొత్త రాములు ,శివరాత్రి లావణ్య జహంగీర్, ఆర్ ఐ మల్లికార్జున్, జూనియర్ అసిస్టెంట్ కరుణాకర్ , పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో సీనియర్ నాయకుడు రాఘవేందర్ గౌడ్



జయభేరి, మేడ్చల్, జూన్ 26 :

మేడ్చల్ పట్టణంలో కులమతాలకు అతీతంగా నిర్వహించిన మొహరం పది రోజుల పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఇమామ్ ఈ ఖాసిం అశుర్ఖానా మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, శరబత్ పంపిణీ కార్యక్రమాలతో పాటు పీర్ల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. మొహరం వేడుకల్లో రామన్నగారి రాఘవేందర్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం వంటి పండుగలు కుల, మతాలకు అతీతంగా సామరస్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సోదర భావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కుల, మత భేదాలు లేకుండా పండుగలను కలిసి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు ఖాజా ఖాలీలుద్దీన్ పర్యవేక్షించారు. వేడుకల్లో కమిటీ సభ్యులు లాయక్ అలీ, రఫిక్, ఎండీ హుస్సేన్ ఖురేషీ, బద్రుద్దీన్, ఖాజా మొయినుద్దీన్, ఎం.ఏ. ముఖ్తార్, మహమ్మద్ జమాల్, అబ్రార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ అలీ, ఇనాయత్ అలీ, నాసిర్, తోఖీర్, రమణగారి రఘు, కౌడే మహేష్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి: కౌడే మహేష్ కురుమ



జయభేరి, మేడ్చల్, జూన్ 26 :

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మేడ్చల్ పట్టణంలోని 297వ డివిజన్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం డివిజన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని ఇంటింటికి వచ్చే బీఎల్వో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు నమోదుకు, పేర్ల సవరణలకు అవసరమైన సరైన పత్రాలను అధికారులకు అందించి తమ ఓటు ఓటర్ల జాబితాలో నుంచి తప్పిపోకుండా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సాయి మాధురి, బీఎల్వో ఇందిరా, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్ వంజరి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు గుండ శ్రీధర్ కురుమ, ఎన్నికల సిబ్బంది మరియు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ పోరాటానికి సిద్ధం కండి.

జయభేరి, కమాన్ పూర్ :

ఉద్యమకారులు భూ పోరాటానికి సిద్ధం కావాలి అని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అన్నారు. కమాన్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మట్టరాజ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని జైలు జీవితం గడిపారని అమరవీరులయ్యారని పేర్కొన్నారు. ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను గత పది సంవత్సరాలుగా కేసీఆర్ పట్టించుకోలేదని ఉద్యమకారులను ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. వెంటనే తెలంగాణ ప్రభుత్వం 250 గజాల భూమి 25 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై రెండవ వారంలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఉప్పల్లో జరగబోవు పోరాటానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు కనకయ్య ఆవిదుర్తి కళావతి మట్ట రాధా ఆవిదుర్తి శ్రావణ్ దూసరవీందర్ భోగి రాజేశ్వరి దేవ అనసూర్య సయ్యద్ రజాక్ అంతగిరి సంపత్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి ఉద్యోగుల ఐక్యత పరస్పరం సహకారం అందించుకోవాలి




- సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పెండెం శ్రీనివాస్

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 26 :

పద్మశాలి ఉద్యోగుల ఐక్యత పరస్పరం సహకారం అందించుకోవాలని, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం హైదరాబాదులో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును స్వాకుల సాలి సమాజ భవనం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో అధ్యక్ష కార్యదర్శులు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సభాధ్యక్షులు ఎంగండ్ల రాహుల్ కుమార్, విశిష్ట అధ్యక్షులు బోద్దుల గంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, ఆర్గనైజేషనల్ కార్యదర్శి సిరందాస్ యాదగిరెందేర్, కోశాధికారి ఆలే బాలకృష్ణ, నాయకులు పిట్ట ఉమాదేవి, వన్నెలదాస్ శ్రీనివాస్, బొద్దుల గంగయ్య, గంజి రామ్మోహన్, ఆడేపు మల్లికార్జున్, మామిడాల రవి, కడవెను లక్ష్మీపతి, చింతగింది సుజాత, బొమ్మర హరిశంకర్, డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, దేవులపల్లి రాజేశ్వర్, ఉషకోయల రాజేందర్, చిలుక శ్రీనివాస్, నోముల చంద్రశేఖర్, ఆడేపు గంగాధర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, గోక నాగేశ్వరరావు, ఆడేపు ప్రవీణ్కుమార్, శ్రీమతి తిరుమల విజయ లక్ష్మీ, వల్ల కొండ వెంకట్ రావు, గుండు సూర్యనారాయణ, తాటిపాముల దత్తాద్రి, గుండు శ్రీనివాస్, రాపోలు సోమేశ్వర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పున్న శ్రీనివాస్, చిలుక మధు, మెదక్ జిల్లా అధ్యక్షులు జెట్ల భాస్కర్, కోట వరప్రసాద్, నిజామబాద్ జిల్లా చౌకె వరప్రసాద్, ఆసం నవీన్, మహబూబ్నగర్ జిల్లా కంచె సుభాష్ చంద్ర, కుకుడాల బాలకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, బిట్ల రాజ రవి తేజ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిందం శ్రీనివాస్, వంగ రవీందర్, మంచిర్యాల జిల్లా పొన్న మల్లయ్య, బోగే సురేందర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, పరికిపండ్ల కోటేశం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అనంతుల లక్ష్మీనారాయణ, దూలం నటరాజ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పెండెం శ్రీనివాస్, రచ్చ గణేష్ ప్రసాద్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, యెశాల విశ్వ కుమార్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు బూర ఉమ శంకర్, గంగుల క్రాంతి కుమార్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఇప్పనపెల్లి మురళ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబత్తిని వెంకట రమణ రావు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున 500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు ప్రజల నుంచి విశేష స్పందన

- మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్

జయభేరి, మేడ్చల్, జూన్ 26 :



ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని కిష్టపూర్ మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ తెలిపారు. శుక్రవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పదిరి గ్రామంలోని పుదూర్‌కిష్టపూర్ డివిజన్‌లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో ఆయన ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణలు, చిరునామా మార్పులు, తొలగింపులు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను బీఎల్ఓలకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ అధికారులకు అవసరమైన సమాచారం అందజేస్తూ, ఓటరు జాబితా ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయడానికి సహకరించారు. ఈ సందర్భంగా తుడుం గణేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు ఉండటం వల్ల ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు, మార్పులు ఉంటే వెంటనే బీఎల్ఓలకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ఎన్నికల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని తుడుం గణేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ హరి చందాన్, బలమణి, నాగమణి, బిఆర్ఎస్ నాయకులు పవన్, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్‌లో గంజాయి పట్టివేత

- ఇద్దరు మహారాష్ట్ర వ్యక్తుల అరెస్ట్

జయభేరి, మేడ్చల్, జూన్ 26 :

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన దాడిలో దాదాపు 5. కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ ఘటన జూన్ 25న ధ్రువా కాలేజీ రోడ్ సమీపంలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.06 వద్ద చోటుచేసుకుంది. మేడ్చల్ సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం అరెస్టైన నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలోని జల్నా జిల్లాకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ అలియాస్ నితిన్ అలియాస్ ఆకాష్ (24), రాజేష్ మాధవ్ చౌదరి (22)గా గుర్తించారు. వీరిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు తనిఖీలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నల్లరంగు బ్యాగులో దాచిపెట్టిన 5.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పరస్పర సమాచార మార్పిడికి ఉపయోగించిన ఒక మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని సేకరించి మేడ్చల్ ప్రాంతంలో అక్రమంగా విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. గంజాయి సరఫరా మూలాలు మరియు ఈ అక్రమ రవాణా ముఠాతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల గుర్తింపునకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జాహెద్ నగర్ కాలనీ ప్రధాన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

- ప్రజలకు అండగా నిలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

జయభేరి, ఉప్పల్, జూన్ 26 :



ఉప్పల్ నియోజకవర్గంలోని బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని జాహెద్ నగర్ కాలనీ* లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) స్థానిక నివాసితులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, దాదాపు ఒక సంవత్సరం క్రితం పైప్‌లైన్ పనుల కోసం కాలనీ ప్రధాన రోడ్డును పూర్తిగా తవ్వినప్పటికీ, ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీలోని ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలు కష్టతరంగా మారాయని, ప్రతి రోజు దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోయారు.
వర్షాలు కురిసిన సమయంలో రోడ్డంతా బురద, నీటితో నిండిపోయి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల సమస్యలను విన్న ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ఈ సమస్యను వెంటనే ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి కాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రాధాన్యత. కాలనీల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పనిచేస్తాను. జాహెద్ నగర్ కాలనీ ప్రధాన రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా నిరంతరం అధికారులతో ఫాలోఅప్ చేస్తాను" అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు షేక్ నజీర్, మీనేశ్వర్ రావు, సమర సింహా రెడ్డి, వినోద్ కుమార్, సమద్, వహీద్, జేవీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొని కాలనీ సమస్యలను వివరించారు.

## పలువురికి మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ పరామర్శ



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం రత్య తండాకు చెందిన బిఆర్ఎస్ మండల నాయకులు వడత్య గణేష్ కుమారుడు వడత్య సిదార్థ్, పెద్ద తండాకు చెందిన రమావత్ లక్ష్మణ్ లు వేరు వేరు రోడ్డు ప్రమాదం లో గాయపడ్డారు.దేవరకొండ పట్టణంలోని సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడత్య సిదార్థ్ నీ,రాములు నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమావత్ లక్ష్మణ్ నీ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రామావత్ నర్సింహ,చెన్నారం సర్పంచ్ రమావత్ తులసిరామ్, బొడ్డుపల్లి కృష్ణ,వడత్య బాలు,ముదిగొండ హరిదాస్,పగిడిమర్రి నాగరాజు ,రాజు, తదితరులు ఉన్నారు.

## ఏక్‌మినార్ మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

- హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

జయభేరి, ఉప్పల్, జూన్ 26 :

10వ మొహర్రం సందర్భంగా ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సమీపంలోని ఏక్‌మినార్ మసీదులో మసీదు కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపవాసదారులు, మసీదుకు విచ్చేసిన ముస్లిం సోదరుల కోసం ఆతిథ్య పూర్వకంగా ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరై మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, యువకులను ఆప్యాయంగా కలుసుకొని 10వ మొహర్రం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, మొహర్రం త్యాగానికి, ధర్మానికి, మానవతా విలువలకు ప్రతీక అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ప్రేమ, ఐక్యత, సహోదర భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మసీదు కమిటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ అలీ, ఉపాధ్యక్షులు మక్దూమ్ గౌసియన్, కోశాధికారి నసీర్, షేక్ ఫరూక్, బాబా భాయ్, రఫీక్, మొహ్సిన్, ఫాసీ, సమద్, షేక్ నజీర్, అతౌల్లా, షకీల్ తదితర కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు మరియు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు విజయవంతం చేశారు.

# జిల్లాలో ఇందిరమ్మ గృహ విప్లవం

- జగిత్యాల జిల్లాలో 10,860 ఇళ్ల మంజూరు
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం
- 9,020 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం
- గ్రామాల్లో జోరుగా సాగుతున్న పనులు
- 99 రోజుల ప్రణాళికలో 2,512 గృహ ప్రవేశాలు లక్ష్య సాధన దిశగా జిల్లా పరుగులు
- కోరుట్లలో అత్యధిక గృహ ప్రవేశాలు
- జగిత్యాల జిల్లాలో అత్యధిక ఇళ్ల మంజూరు
- ధర్మపురి నుంచి చొప్పదండి వరకు నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి
- పేదల జీవితాల్లో స్థిరత్వం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు



**జయభేరి, జగిత్యాల :**

జగిత్యాల జిల్లాలోని పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించి, వారు ఆత్మ గౌరవముతో జీవించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం జగిత్యాల జిల్లాలో గృహ విప్లవానికి నాంది పలుకుతోంది. గుడిసెలు, అద్దె ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో ఆశాజనక ఫలితాలను అందిస్తోంది. వేలాది కుటుంబాల సొంతింటి కలను నిజం చేస్తూ, ఇందిరమ్మ ఇండ్లు పేదల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి.

10,860 ఇళ్ల మంజూరు భారీ స్థాయిలో అమలు జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొత్తం 10,860 ఇళ్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జిల్లాలో గృహ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. మంజూరైన ఇళ్లలో ఇప్పటికే 9,020 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో 1,840 ఇళ్లను త్వరలోనే గ్రౌండింగ్ చేసి నిర్మాణాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోంది.

**7,885 ఇళ్లు వివిధ దశల్లో పురోగతి**

జిల్లాలో ప్రస్తుతం 7,885 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 1,311 ఇళ్లు బేస్మెంట్ దశలో ఉండగా, 820 ఇళ్లలో గోడల నిర్మాణం పూర్తయింది. 4,186 ఇళ్లలో ఆర్‌సీసీ స్లాబ్ పనులు పూర్తయ్యాయి. మరో 1,568 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. ప్రతి గ్రామంలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతుండగా, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.

**99 రోజుల ప్రణాళికలో విశేష పురోగతి**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కింద మే 2026 చివరి నాటికి 3,136 గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ లక్ష్య సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే 2,512 గృహ ప్రవేశాలు విజయవంతంగా నిర్వహించడం ద్వారా వేలాది పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో జగిత్యాల జిల్లా గణనీయమైన పురోగతిని నమోదు చేస్తోంది.

**ధర్మపురిలో జోరుగా సాగుతున్న నిర్మాణాలు**

ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 2,756 ఇళ్లకు మంజూరు లభించింది. వీటిలో 2,464 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 354 ఇళ్లు బేస్మెంట్ దశలో ఉండగా, 214 ఇళ్లు రూఫ్ లెవెల్ దశలో ఉన్నాయి. 1,214 ఇళ్లలో ఆర్‌సీసీ స్లాబ్ పనులు పూర్తయ్యాయి. 442 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. మొత్తం 2,224 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 748 కుటుంబాలు గృహ ప్రవేశాలు నిర్వహించాయి. నియోజకవర్గంలో మరిన్ని కుటుంబాలు త్వరలోనే సొంతింటి కలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నాయి.

**అత్యధిక మంజూరులతో జగిత్యాల నియోజకవర్గం**

జిల్లాలోనే అత్యధికంగా జగిత్యాల నియోజకవర్గంలో 3,494 ఇళ్లకు మంజూరు లభించింది. వీటిలో 2,705 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 480 ఇళ్లు బేస్మెంట్ దశలో, 332 ఇళ్లు రూఫ్ లెవెల్ దశలో ఉన్నాయి. 1,238 ఇళ్లలో ఆర్‌సీసీ స్లాబ్ పూర్తికాగా, 289 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. మొత్తం 2,339 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 489 కుటుంబాలు గృహ ప్రవేశాలు నిర్వహించాయి. జిల్లా కేంద్రం కావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు.



## సుతారిగూడలో సీసీ రోడ్డు పనుల పరిశీలన..

**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**

మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని సుతారిగూడలో చేపడుతున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. అనంతరం వార్డు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గుండ్లపోచంపల్లి డివిజన్‌లో త్వరలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకార బోయిన మల్లేష్ ముదిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల పెంటయ్య ముదిరాజ్, భాస్కర్ ముదిరాజ్, ఎల్ వినోద్ గౌడ్, హరిబాబు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత



**జయభేరి, మేడ్చల్ :**

విద్యుత్ మరమ్మతుల కారణంగా గుండ్లపోచంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం (జూన్ 27) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం ప్రభావిత ప్రాంతాల్లో గుండ్లపోచంపల్లి గ్రామం, బీరప్పగడ్డ, మైసమ్మగూడ, దూలపల్లి, అయోధ్య ఎక్స్ రోడ్, ఏపీఐఐసీ, అపారెల్ పార్క్, నెయిబర్‌హుడ్, అపర్ణ, బేలా విస్టా, ఏజీ సైట్, ఊర్జిత 1, 2, 3 కాలనీలు మరియు లక్ష్మీనగర్ లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ప్రజలు, వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు కోరారు.

## కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహరం

- 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్




**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**

మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఫీర్ల పండుగ వేడుకలలో 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని దట్టి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ, ముస్లింలు అందరూ కలిసి మత సామరస్యంతో జరుపుకునే పండుగ మొహరం అని పేర్కొన్నారు. ఎప్పుడూ అందరూ సోదర భావంతో కుల, మతాలకతీతంగా పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి మెలిసి మొహరం పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఫీర్ల పండుగ సందర్భంగా ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో మొహరం పండుగనీ జరుపుకుంటున్నారని వారందరికీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేదలకు ఆసరాగా సీఎం సహాయనిధి పథకం

- ఎంపీ ఈటల రాజేందర్



**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**

వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిది పథకం పేద ప్రజలకు ఆసరాగా నిలుస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. శుక్రవారం మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ కు చెందిన ఉనిగొర్ల నాగమల్లయ్య కు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన రూ. 49,500 ల చెక్కును ఎంపీ ఈటల రాజేందర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతు వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ఈ పథకం వర్గంగా మారిందన్నారు. ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఈటల సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, నర్సింగ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌కు మేడ్చల్ యువకుడు గోపాల్ యాదవ్

**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**

నేపాల్ రాజధాని ఖాట్మండు వేదికగా జూన్ 27 నుంచి ప్రారంభం కానున్న మొదటి దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్లో పాల్గొనే భారత జాతీయ రాక్‌బాల్ జట్టుకు మేడ్చల్ జిల్లా పూడూరు పట్టణానికి చెందిన యువ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీల్లో ఆయన కనబరిచిన ప్రతిభను గుర్తించిన జాతీయ సెలెక్టర్లు ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఆయనను ఎంపిక చేసినట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం పట్ల గోపాల్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాక్‌బాల్ క్రీడలో భారత జట్టు తరపున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాన్ని దక్కించుకోవడం పట్ల పూడూరు పట్టణంతో పాటు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. గోపాల్ యాదవ్‌కు స్నేహితులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయవంతం కావడంతో పాటు గోపాల్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడీ టీచర్, ఆయాల పోస్టులు ఖాళీలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలంలోని అంగన్వాడీ టీచర్ ఆయాల పోస్టుల ఖాళీల భర్తీ కొరకు అర్హులైన వాళ్ళు అప్లై చేసుకోగలరని వివిధ గ్రామపంచాయతీలలో సూపర్వైజర్స్ ,డి చిట్టమ్మ ,ఎం విజయలక్ష్మి, సర్పంచ్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ వివరాలు అతికించడం జరిగినది. మైనంపల్లి,గన్యానాయక తండా, కొర్రతండ, శేరిపల్లి, రత్య తండా, చెరువు కొమ్ము తండా, శకృ తండా, దుబ్బ తండా.

## సిఎం సహాయనిదిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చొరవ చూపారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌కు చెందిన ముదునూరి విజయదుర్గ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. వైద్య వ్యయాలు అధికంగా ఉండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందించాలని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి ద్వారా విజ్ఞప్తి చేశారు. బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ ఎల్ఓసీ మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి ప్రభుత్వ సహాయం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు బేరి బాల్‌రాజ్, అమరం జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో పాల్గొన్న PACS చైర్మన్ Dr. వేణుధర్ రెడ్డి

**జయభేరి, కొండమల్లెపల్లి :**



కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పీర్ల పండుగ వేడుకల్లో పీసీసీ సభ్యులు, PACS చైర్మెన్ డా. దుడిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్ల దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలను, ముస్లిం సోదరులను కలిసి మొహరం శుభాకాంక్షలు తెలియజేశారు. డా. దుడిపాల వేణుధర్ రెడ్డి మాట్లాడుతూ, మొహరం త్యాగం, ధర్మం, ఐక్యతకు ప్రతీక అని, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో జీవించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ సామరస్య వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ముస్లిం సోదరులు, యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గో టు విలేజ్

**జయభేరి, మేడ్చల్, జూన్ 26 :**



మేడ్చల్ పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ "గో టు విలేజ్" పిలుపుమేరకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారం లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రామచంద్ర మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో మేడ్చల్ మండలంలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి పండుగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా యువసేన అధ్యక్షుడు పరుశురాం మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జూలై 7న గ్రామ కమిటీలు, మండల కమిటీల సమన్వయంతో మేడ్చల్ టౌన్‌లో భారీ ఎత్తున ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎంఎస్పీ వైస్ ప్రెసిడెంట్ బాల నరసింహ మాదిగ, జిల్లా కన్వీనర్ జీడిపల్లి శివకుమార్, సీనియర్ నాయకులు జీడిపల్లి రామకృష్ణ, ఎర్ర బాలకృష్ణ, ఎర్ర విజయరావు తదితరులు పాల్గొన్నారు.



# నేను ఎవరితోనూ రిలేషన్‌షిప్‌లో లేను'..

స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో తరచూ పలు వార్తలు వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆమె రిలేషన్‌షిప్ గురించి గత కొంతకాలంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారాలపై స్వయంగా శృతి హాసన్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శృతి హాసన్‌కు ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం మీరు ఎవరితోనైనా రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అని ప్రశ్నించగా, శృతి ఎలాంటి సందేహాలకు తావులేకుండా సమాధానం ఇచ్చారు. నేను ప్రస్తుతం ఎవరితోనూ, ఎలాంటి రిలేషన్‌షిప్‌లో లేను అని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడినట్లైంది. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో శృతి హాసన్ ప్రత్యేక పాటలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక హీరోయిన్‌గా ఆమె నటించనున్న 'సలార్ 2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు శృతి హాసన్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.




# నా భర్త కంటే మీరే ఎక్కువ ఇష్టం..

**అభిమాని మాటలకు షారుఖ్ అదిరిపోయే రిప్లై!**

వెండితెరపైనే కాదు.. నిజ జీవితంలోనూ తనదైన చమత్కారంతో, తనదైన మాటలతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకోవడం బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌కే చెల్లింది. తాజాగా కర్ణాటకలోని మంగళూరులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడ ఓ మహిళా అభిమాని అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. జూన్ 25న మంగళూరులో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి షారుఖ్ ఖాన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. షారుఖ్ స్టేజ్ పైకి రాగానే ఆయన స్థానిక కన్నడ భాషలో "నమస్కారం" అంటూ మాట్లాడటం అక్కడి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విమానాశ్రయం నుండి వేదిక వరకు తనకు లభించిన అపూర్వ స్వాగతంపై షారుఖ్ హర్షం వ్యక్తం చేస్తూ మంగళూరు ప్రజల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ వేడుకలో భాగంగా జరిగిన అభిమానుల ముఖాముఖి సెషన్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సదరు మహిళా అభిమాని మైక్ తీసుకుని, నా భర్త కంటే నేను మిమ్మల్నే ఎక్కువగా ప్రేమిస్తున్నాను అంటూ షారుఖ్‌పై తనకున్న అభిమానాన్ని బహిరంగంగా చాటుకుంది. ఇక ఈ ఊహించని వ్యాఖ్యలకు బాలీవుడ్ కింగ్ ఖాన్ ఏమాత్రం తడబడకుండా, తనదైన స్టైల్లో స్పందించారు. "ఇలాంటి రహస్యాలు అందరి ముందు కాకుండా ఒంటరిగా చెప్పాలి కదా!" అంటూ చమత్కరించడంతో హాలంతా నవ్వులు విరిశాయి. అక్కడితో ఆగకుండా ఆ అభిమాని భర్తకు ఇబ్బంది కలగకుండా షారుఖ్ పరిస్థితిని ఎంతో హుందాగా మార్చేశారు. "మీ భావాలను నేను గౌరవిస్తాను. మీ భర్త కూడా దీనిని సరదాగానే తీసుకుంటారని భావిస్తున్నాను. మీతో పాటు మీ భర్తకు, మీ కుటుంబ సభ్యులందరికీ నా తరపున ప్రత్యేక ప్రేమలు" అంటూ షారుక్ చెప్పుకొచ్చాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుంది. షారుఖ్ ఖాన్ కేవలం తెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఎంతటి సమయస్ఫూర్తి, హాస్యచతురత కలిగిన వ్యక్తి అనడానికి ఈ ఘటనే నిదర్శనమని నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఎన్ని రికార్డులు సృష్టించినా, అభిమానుల పట్ల ఆయన చూపించే గౌరవమే ఆయన్ను ఎప్పటికీ 'బాద్‌షా'గా నిలబెడుతుందని మరోసారి నిరూపితమైంది.

# 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్.. 'వారణాసి'పై రాజమౌళి



మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనామార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.



# అబ్బబ్బా.. ఏం మారింది భయ్యా..

ఆర్ఆర్ఆర్ సినిమా సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రికార్డులు సృష్టించింది. అంతేకాకుండా ఈ సినిమా ఆస్కార్ వేదికపై సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. అయితే ఈ సినిమాలో తన అమాయకపు చూపులతో, నటనతో అందరిని ఆకట్టుకున్న చిన్నారి గుర్తుందా.. ? మల్లీ పాత్రలో ఒదిగిపోయింది. డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రాల్లో ఆర్ఆర్ఆర్ ఒకటి. బాహుబలి తర్వాత అదే స్థాయిలో బాక్సాఫీస్ షేక్ చేసిన మూవీ ఇది. ఇందులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలు పోషించగా.. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్, అజయ్ దేవగణ్, శ్రియా కీలకపాత్రలు పోషించారు. అయితే ఈ సినిమాలో కీలకపాత్ర అంటే మల్లిదే. ఇందులో తన అమాయకపు చూపులతో.. సహజ నటనతో ప్రేక్షకుల హృదయాలు గెలుచుకుంది మల్లి. ఈ పాత్రలో కనిపించిన అమ్మాయి పేరు ట్వింకిల్ శర్మ. ఆర్ఆర్ఆర్ సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది ట్వింకిల్. అంతకు ముందు ఈ చిన్నారి పలు యాడ్స్ చేసింది. ఇదిలా ఉంటే.. ట్రిపుల్ ఆర్ తర్వాత ట్వింకిల్ శర్మ ఏ తెలుగు సినిమాలోనూ కనిపించలేదు. కానీ ఇప్పుడు ఈ పాప లేటేస్ట్ లుక్స్ చూసి ఆశ్చర్యపోతున్నారు అడియన్స్. ఆర్ఆర్ఆర్ సినిమా విడుదలై సంవత్సరాలు గడుస్తున్నాయి. అప్పుడు అమాయకంగా కనిపించిన మల్లీ.. ఇప్పుడు నెట్టింట రచ్చ చేస్తుంది. గ్లామరస్ లుక్కులో మోడ్రన్ డ్రెస్సుల లో ఫోటోషూట్స్ షేర్ చేస్తూ నెట్టింట సందడి చేస్తుంది. తాజాగా ట్వింకిల్ లేటేస్ట్ లుక్స్ చూసి ఫ్యూచర్ హీరోయిన్.. ఏం మారింది భయ్యా.. వాటె మేకోవర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.

# ఈ పుట్టినరోజు నాకు చాలా ప్రత్యేకం



తన 86వ పుట్టినరోజు సందర్భంగా "పద్మశ్రీ" పురస్కారాన్ని పొందడం తనకు అనిర్వచనీయమైన ఆనందానుభూతిని ఇచ్చిందని అన్నారు ప్రముఖ నటులు నిర్మాత మాజీ పార్లమెంటు సభ్యులు
మురళీమోహన్. తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ మురళీమోహన్ ను ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఫిలింక్రిటిక్స్ గౌరవాధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ... సౌమ్యుడు అజాత శత్రువు ఎవ్వరికి అండ నివారు ఐన మురళీమోహన్ గారికి పద్మశ్రీ అవార్డు చాలా ఆలస్యంగా వచ్చింది. ఇది ఆయనకు ఎప్పుడో రావలసింది. మురళీమోహన్ గారి పుట్టిన రోజుకు ఒక రోజు ముందు ఈ అవార్డు అందుకోవడం అనేది ఆయనకు పుట్టినరోజు గిఫ్టుల అవుతుంది అన్నారు. అదే విధంగా ఫిలిం క్రిటిక్స్ కార్యవర్గం నిర్వహించి తలపెట్టిన మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని మీరు అనుమతిస్తే పెట్టుకుంటాము అని అన్నారు. ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల ప్రసాదరావు మాట్లాడుతూ.. 58 ఏండ్ల చరిత్ర గలిగిన ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ ను .. తొలితరం జర్నలిస్టులు పి,యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి, గుడిపూడి శ్రీహరి తదితరులు స్థాపించారు. కొన్నాళ్ళుగా స్థబ్దుగా ఉన్న అసోసియేషన్ ఈ మధ్యనే పున: ప్రారంభమైంది. ఎన్నో కార్యక్రమాలు తలపెట్టి చేస్తున్నాము.
అందులో భాగంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ నిర్వహించబోయే మీట్ ద ప్రెస్ కార్యక్రమానికి రావడానికి మురళీ మోహన్ గారు సుముఖత వ్యక్త పరిచినందుకు ఆనందంగా ఉంది అన్నారు. ఫిలిం క్రిటిక్స్ ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి మాట్లాడుతూ .. సినిమా పరిశ్రమలోని ప్రతి ఒక్కరు మురళీ మోహన్ గారికి పద్మశ్రీ పురస్కారం ఆలస్యంగా వచ్చింది అనుకుంటున్నారు. మురళీమోహన్ గారిని యావత్ చిత్ర పరిశ్రమ ఈ సందర్భంగా ఘనంగా సత్కరిస్తే బాగుంటుందని నేను అభిప్రాయపడుతున్నాను అన్నారు. ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంత ఆలస్యంగా పద్మశ్రీ వచ్చినప్పటికీ సమర్థుడైన వ్యక్తికి వచ్చిందని భావిస్తున్నాము. భవిష్యత్ లో మీరు పద్మభూషణ్ కూడా అందుకోవాలని కోరుకుంటున్నాము అన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ.... తనను పద్మశ్రీ పురస్కారానికి సిఫార్సు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు సినిమా అభివృద్ధి కోసం విశేషంగా పాటుపడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ తో తనకు గల సుదీర్ఘ అనుబంధాన్ని మురళీ మోహన్ నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శక నిర్మాతలు అచ్చిరెడ్డి ఎస్. వి.కృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రభు, అధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి, ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ఉపకార్యదర్శులు శ్రీమతి పర్వీన్‌బాబి, శ్యామ్, కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ మామిడి పల్లి గిరిధర్, ధీరజ్ అప్పాజీ, నవీన్, ఆర్.డి,యస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**